క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు



మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మున్సిపల్ అధికారులకు సూచించారు. బలిఘట్టం ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఉత్తరవాహిని ప్రాంతాన్ని చైర్‌పర్సన్ పరిశీలించారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులను రద్దీని దృష్టిలో పెట్టుకుని ఘాట్లను పరిశుభ్రం చేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

5న మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరులో గ్రామ దేవత మోదకొండమ్మ తీర్థాన్ని ఈనెల 5న భారీగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ గొళ్ళవిల్లి సంజీవరావు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం, ముగ్గుల పోటీలు, భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

మాకవరపాలెం: ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం దేవదాయశాఖ డీఈ సైద స్థల పరిశీలన చేశారు. స్థానిక బీసీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించేందుకు ఇటీవల ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టేందుకుగాను బుధవారం ఆయన స్థల పరిశీలన చేశారు. నిర్మాణానికి సంబంధించి ప్లాన్ ఇచ్చారు. పనులను వెంటనే ప్రారంభించాలని కమిటీ సభ్యులకు సూచించారు.

32 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న డిపో మేనేజర్ ధీరజ్, సిబ్బంది

నర్సీపట్నం: రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్ ప్రారంభించారు. శిబిరంలో డిపో మేనేజర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది మొత్తం 32 మంది రక్తదానం చేశారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాకవరపాలెం: అర్హత లేకున్నా పింఛను మంజూరు చేశారని స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో అరుణశ్రీ విచారణ చేశారు. మండల కేంద్రానికి చెందిన కట్టా రామారావు పింఛను పొందేందుకు అనర్హుడని ఆర్‌టీఐ కార్యకర్త ఫ్రాన్సిస్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. విచారణకు కలెక్టర్‌ఆదేశాలు జారీచేయడంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఫిర్యాదుదారుడి సమక్షంలో రామారావును విచారణ చేశారు. ఇరువురి నుంచి వివరాలు తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్ కు అందజేస్తామని ఎంపీడీవో విలేకరులకు తెలిపారు.

ఐదు ఇసుక బళ్ల పట్టివేత

మకవరపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఎడ్లబళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలో ఉన్న సర్వాన దిలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నట్టు అందిన సమాచారంతో బుధవారం దాడి చేసి, ఐదు ఇసుక బళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జూదం నిర్వాహకుల అరెస్టు

చోడవరంరూరల్: ఖండిపల్లిలో గుడి వద్ద జూదం నిర్వహిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసి దాడి చేసి బండి మురళి, అప్పికొండ కొండ బాబులను అరెస్టు చేసి వారినుంచి రూ. 640 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

ఆధ్యాత్మిక శోభ

భీష్మ ఏకాదశి వేళ భక్తులు ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలారు.పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునుంచి భారీ ఎత్తున జనం ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల కల్యాణమహోత్సవాలు, జాతరలు నిర్వహించారు.

భీష్మ ఏకాదశి పూజలతో ఆలయాలు కళకళ

మాకవరపాలెం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర ఆలయంలో లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారికి అర్చన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి ఆలయం వద్ద సహస్ర పుష్పార్చన, కుంకుమ పూజలతోపాటు 108 కళశాల జలంతో అభిషేకం నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామని, భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

గొలుగొండ: భీష్మ ఏకాదశి సందర్భంగా దారమఠంలో మహాదేవుడి ఉత్సవ విగ్రహాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దారమఠం నుంచి నర్సంగిబిల్లి వరకు ఊరేగింపు సాగింది. కొత్తపాలెం, దారపాలెం, జోగుంపేట, గొలుగొండ, జానికీరాంపురం, నర్సంగిబిల్లి గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి, పూజలు చేశారు.



జంపెన రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జంపెనలో ..

మాడుగుల: మండలంలోని జంపెన గ్రామంలో బుధవారం సర్పంచ్ గురువునాయుడు ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజన కార్యక్రమంలో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు. 26 ఏళ్లుగా ప్రతీఏటా భీష్మ ఏకాదశి రోజున భజనలు నిర్వహిస్తున్నామని గురువు వానపల్లి ధర్మారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెచ్చేటి కొండలరావు, మానస పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



దారమఠంలో శివుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కనుల పండువగా భ్రమరాంబ కల్యాణం



వడ్డాదిలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతీ సంవత్సరం భీష్మ ఏకాదశి రోజున స్వామివారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఐదు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి ఆలయ మండపంలో వేలాది మంది భక్తుల సమక్షంలో భ్రమరాంబిక,మల్లికార్జునస్వామి కల్యాణమహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు,అధికారులు,నాయకులు ఈ వేడకల్లో పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరి కల్యాణ మహోత్సవం



ఆలయ ఆవరణలో పెళ్లి రాట వేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో ఉమామహేశ్వరీ దేవి కల్యాణ(తీర్థ) మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉమా మహేశ్వరి దేవి పెళ్లి రాట వేశారు. రాత్రి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితా నాయుడు, మారేపల్లి ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి, పరవాడ రవి తదితర ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉమామహేశ్వరి దేవి ఆలయం పక్కనే ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరి దేవి

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



ధ్వజస్తంభ పునః ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టిస్తున్న ధ్వజస్తంభం

చోడవరం: చోళ్లరాజులు కాలం నాటి అతిప్రాచీన శివాలయమైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి రావు, వెంకటరావు పర్యవేక్షణలో వేద పండితుడు శ్రీపాద రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 40అడుగుల పొడవు గల ఈ ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో ఆలయప్రాంగణంలో ప్రతిష్ట చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నామన్నారు. గౌరీశ్వరస్వామి ఆలయానికి ధ్వజస్తంభ ప్రతిష్టతోపాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరు, ప్రహారీ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు, ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థాలు

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్ల, గర్రుపు పరుగు పందాలు
- పెద్ద సంఖ్యలో తిలకించిన ప్రజలు



పేరంటాల ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు: దాలివలస గ్రామ దేవత ఎరుకులమ్మ పేరంటాలు తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పరుగు పందాల ప్రదర్శనను నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలు ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో విజేతలైన ఎడ్ల, గుర్రాల యజమానులకు ఎంపీపీ జగన్‌మోహన్, కొత్తపెంట సర్పంచ్ నీలిమా వెంకటరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

ఎ.భీమవరంలో..

ఎ.భీమవరంలో నర్సమాంబ పేరంటాలు తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం నాడు తీర్థం జరపడం ఆనవాయితీ. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. పేరంటాలు ఆలయంలో గ్రామ సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, శేషు, పాల సంఘం అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలను జరిపారు.



పందెంలో ఉరకలేస్తున్న ఎడ్లు

శివాలయం ప్రారంభం

చ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురంలో నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇటీవల కొత్తగా గ్రామంలో శివాలయం నిర్మించారు. మూడు రోజులుగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. బుధవారం శివలింగ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నాలుగు వేల మందికి అన్న సమారాధన జరిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు,విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ పడాల నాగభూషణం,ఆలయ ధర్మకర్త గణపతిరాజు శ్రీనివాసరాజు తదితర్లు పాల్గొన్నారు.



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని బుచ్చింపేట గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ చంద్ర, ఎంపీటీసీ సత్యవతితో కలసి ఆయన గడపగడపకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు మంజూరు కాని వారికి వెంటనే వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల అభ్యర్థన మేరకు బోరు, విద్యుత్ స్తంభం ఏర్పాటుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దోసపత్ని రాజు, కె.సన్యాసినాయుడు, పార్టీ సీనియర్ లీడర్ పోతల లక్ష్మీ శ్రీనివాస్, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, ఎంపీడీవో ప్రభాకర్రావు, ఇతర అధికారులు సువార్త, సూర్యకుమారి, సాధన, ఉమా మహేశ్వరుడు తదతరులు పాల్గొన్నారు.



బుచ్చింపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

జంతు సంక్షేమం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న పశువైద్యాధికారి నూకేశ్వరరావు

రోలుగుంట: జంతు సంక్షేమం సామాజిక బాధ్యత అని, ప్రతీ ఒక్కరూ వాటి సంక్షేమానికి కృషి చేయాలని స్థానిక పశు వైద్యాధికారి గొర్లె నూకేశ్వరరావు అన్నారు. జాతీయ జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిండుగొండలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంతువుల కోసం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు.

తాగునీటి బోర్లు ప్రారంభం

నాతవరం: సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. నాసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సరుగుడు పంచాయతీ శివారు మాసంపల్లి రాజవరం, చీడిపాలెం, యరకన్నపాలెం గ్రామాల్లో రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లను బుధవారం ఎంపీపీ లక్ష్మణమూర్తితో కలిసి నాసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రాజా కులపతి, జ్యోతి ప్రేమ్‌దాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు గిరిజన ప్రాంతంలో చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థ కార్యకర్త శ్రీను, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు బండి గంగరాజు, సరుగుడు సర్పంచ్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాసంపల్లిలో బోరు ప్రారంభిస్తున్న దృశ్యం

నిత్యావసర సరకులు అందజేత

మాడుగుల: దివ్యాంగుల కుటుంబాలకు స్థానిక అభిరుచి అకాడమీ నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులను అందజేసింది. గ్రామానికి చెందిన రాళ్ళపూడి శ్రీను, ద్రాక్షారపు సన్యాసిరావు ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందారు. ఈ విషయం తెలుసుకున్న అభిరుచి అకాడమీ సభ్యులు ఆ రెండు కుటుంబాలకు బుధవారం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. అభిరుచి అకాడమీ సభ్యులు వర్మ, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనువాసరావు, ఎడ్ల హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ, అకాడమీ సభ్యుడు వర్మ

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం

చోడవరం: పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా చోడవరం పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎ.ఎస్. నారాయణ రావు ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పి.విజయ, ఉపాధ్యక్షుడిగా కె.యశ్వంత్, కోశాధికారిగా టి.ఎ.ఈ.ఎస్.ఎస్. సూర్యనారాయణ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా వై.ఎ.వి. గంగాధర్, కె.వైకుంఠరావు, అధికార ప్రతినిధిగా బి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా జి.విష్ణు, బి.గాయత్రి, టి.భాగ్య, ప్రకాష్ నియమితులయ్యారు.



అధ్యక్షుడు నారాయణరావు

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: ఏఎల్ పురం పంచాయతీలో మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి బుధవారం స్థానిక ఎంపీటీసీ చింతల బుల్లిప్రసాద్ దంపతులు భూమి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఆలయం నిర్మాణానికి ఇటీవల రూ.10 లక్షల మంజూరు చేసింది. భూమిపూజ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు ,ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ బుల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభోత్సవం రేపు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీపీ రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి తదితరులు

మాడుగుల: మండలంలోని సత్యవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, గ్రామంలో రూ.42 లక్షల వ్యయంతో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు శుక్రవారం ప్రారంభించనున్నట్టు ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు.నూతనంగా నిర్మించిన సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రాలను వారు బుధవారం పరిశీలించారు. ఇదే సచివాలయ పరిధిలో గొళ్లపేటలో తాగునీటి పథకం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇందుకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్లను ఒకటో తేదీ బుధవారం వలంటీర్లు ఠంచన్‌గా పంపిణీ చేశారు. ప్రతీ నెల మాదిరిగా సూర్యోదయం కాక ముందే తలుపు తట్టి పింఛన్లు అందజేశారు. పలు గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను సైతం అందజేశారు. వేచలంలో స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, రెడ్డి బలరాం తదితర గ్రామ పెద్దల చేతులు మీదుగా కొత్త పింఛన్లు అందజేశారు.



వేచలంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ శతారి నాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి

పండగ ముసుగులో పింఛన్‌దారుల నుంచి నగదు వసూలు

నర్సీపట్నం: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో పండగ ముసుగులో పింఛన్‌దారుల నుంచి డబ్బులు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. వసూళ్ల పర్వంపై గ్రామానికి చెందిన కొంత మంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ నగదును బుధవారం గ్రామ వలంటీర్లు పంపిణీ చేశారు. గౌరీ పరమేశ్వర్ల పండగ ముసుగులో ఇండిపెండెంట్ సర్పంచ్ భర్త అనుచరులు వసూళ్లకు పాల్పడ్డారని పలువురు తెలిపారు. వలంటీర్లు పింఛన్ నగదు అందజేసిన వెంటనే లబ్ధిదారుల నుంచి అక్కడిక్కడే రూ.500 చొప్పున వసూలు చేసినట్టు పింఛన్‌దారులు బహిరంగంగా తెలిపారు.

విస్తృతంగా విద్య,అవగాహన కార్యక్రమాలు

రోలుగుంట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్య, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ పీవో మేరీ సువార్త ఆదేశించారు. బుచ్చింపేట గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ అపరంజనితో కలసి ఆమె బుధవారం సందర్శించారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు విద్యనందించడంతో పాటు గృహ సందర్శన ద్వారా గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి, పోషక విలువలు గల ఆహారం గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా బాబూరావు



దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా దేవరాపల్లి మండలం బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు నియమితులయ్యారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా తాజాగా నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా నియమించడం పట్ల బాబూరావు హర్షం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో నియమించి, ఈ బాధ్యతలను అప్పగించిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరులో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు, వైద్యాధికారి ప్రసాద్ పాత్రుడు ఎంపీహెచ్‌వో రవికుమార్ ఏఎన్ఎం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.